క్లుప్తంగా

వైభవంగా పార్వేట ఉత్సవం

శ్రీకాళహస్తి: చెన్నైరోడ్డులోని ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి వారి పార్వేట ఉత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరంపై కొలువుదీర్చి, పురవీధుల్లో ఊరేగించారు. స్వామి,అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం నాటితో ధర్మరాజస్వామి వార్షిక ఉత్సవాలు ముగిశాయి.

హెచ్‌ఎంకు సన్మానం



శ్రీకాళహస్తి: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తీగల వెంకటయ్యను బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్‌రెడ్డి, దేవప్రసాద్, నీలకంఠేశ్వర్లు, భానుప్రకాష్, వెంకటముని, ఇందిరమ్మ, రెడ్డెప్ప, చిట్టి మధు, వైఎస్సార్ సీపీ నాయకుల ఆర్కాట్ శంకర్, సురేష్, కంఠా ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

కృష్ణయ్య సేవలు మరువలేనివి



శ్రీకాళహస్తి: కృష్ణయ్య సేవలు మరువలేనివని వక్తలు కొనియాడారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటీ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో 45 ఏళ్ల విధులు నిర్వహిస్తున్న ఎం.కృష్ణయ్య ఉద్యోగ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయనకు మున్సిపల్ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఫిట్టర్ సాయి సుబ్రహ్మణ్యంరెడ్డి, మున్సిపల్ అధికారులు సిబ్బంది మేళాగారం వెంకట మునిరెడ్డి, వెంకటముని, రాము, శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మల్లెంబాకం కృష్ణారెడ్డి, మప్పేటి నాథ మునిరెడ్డి, భాస్కర్, జాకీర్ పాల్గొన్నారు.

భద్రతపై అవగాహన

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం పుత్తూరు–తిరుపతి జాతీయ రహదారిపై తూకివాకం క్రాస్ వద్ద రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి తమ సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనచోదకులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న యంగ్ ఎంప్లాయీస్ సోషల్ సర్వీసెస్ ప్రతినిధులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల ప్రాథమిక పాఠశాల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు బుధవారం యంగ్ ఎంప్లాయీస్ సోషల్ సర్వీసెస్ శ్రీకాళహస్తి వారు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఒక్కో విద్యార్థికి నాలుగు నోటు పుస్తకాలు, పెన్నులు, పలకలు, ఇతర విద్యా సామగ్రితోపాటు పాఠశాలకు రెండు సీలింగ్ ఫ్యాన్లు వితరణగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యంగ్ ఎంప్లాయీస్ సోషల్ సర్వీసెస్ సంస్థ సభ్యులు నారాయణ, కాంగ్రెస్, సురేష్‌బాబు, శ్రీనివాసులు, రాజశేఖర్, ప్రదీప్‌కుమార్, ఉపాధ్యాయులు పద్మావతి, వెంకటేశ్వరరావు, విజయభారతి, అనురాధ పాల్గొన్నారు.

చెత్తగించకుంటే చిక్కులే

స్వచ్ఛభారత్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమున్నత స్వప్నం. దాన్ని సాకారం చేసేందుకు అధిక మొత్తంలో నిధులు మంజూరు చేస్తున్నాయి. డంపింగ్ యార్డులు నిర్మిస్తున్నాయి. ఏటా అవార్డులు ప్రకటిస్తున్నాయి. అయితే ఆ చెత్తను శుభ్రం చేసే పారిశుద్ధ్య కార్మికుల గురించి పట్టించుకోలేదు. దీంతో వారు మూకుమ్మడి సమ్మెలోకి దిగారు. ఫలితం ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. ఇకనైనా ప్రభుత్వాలు చిత్తగించకుంటే చిక్కులు తప్పవని ప్రజలు అంటున్నారు.

- సమ్మెలో కార్మికులు
- రోడ్లపై ఎక్కడి చెత్త అక్కడే



అంబేడ్కర్ విగ్రహం కూడలిలో షాపులు మధ్య పేరుకుపోయిన చెత్త



చెక్ పోస్ట్ వద్ద..

రేణిగుంట: పట్టణంలో రోడ్లపై ఎక్కడ చెత్త అక్కడే ఉంది. ఏ వీధిలో చూసినా చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. రోడ్లపై ఉన్న చెత్త కుప్పల్లో పశువులు, శునకాలు తిష్టవేసి, ఆ పరిసరాల్లో రాకపోకలు సాగించే వారిపై దాడి చేస్తున్నాయి. దీంతో జనం భయాందోళన చెందుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన భరించలేక ఇక్కట్లు పడుతున్నారు.

సమ్మెలో కార్మికులు

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులు విధులకు హాజరు కాలేదు. దీంతో పట్టణంలో పారిశుద్ధ్యం పడకేసింది. వేలాది మంది తిరిగే ప్రదేశం కావడంతో నిత్యం చెత్తను శుభ్రం చేస్తుంటేనే అక్కడక్కడ చెత్తకుప్పలు దర్శనమిచ్చేవి. అలాంటిది చెత్త ఎత్తకపోవడంతో పెద్దఎత్తున పేరుకుపోయి, దుర్వాసన వెదజల్లుతోంది. సమ్మెలో కార్మికులు వెళతారని ముందుగానే తెలిసినా ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయం ఆలోచించకుండా నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరించడంతోనే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు పారిశుద్ధ్య కార్మికుల డిమాండ్లను నెరవేర్చకుంటే చెత్త సమస్య పెరిగి, ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉందని వాపోతున్నారు.



పంచాయతీ కార్యాలయం సమీపంలో..



మంచినీళ్లగుంట సమీపంలో..

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐ

శ్రీకాళహస్తి: మేర్లపాక టోల్‌గేట్ వద్ద బుధవారం వ్యతిరేక దిశలో వెళుతున్న వాహనాలను ఎంవీఐ దామోదర్ నాయుడు తనిఖీ చేశారు. అందులో భాగంగా మూడు ఆర్టీసీ బస్సులు, ఒక కంపెనీ బస్సు టోల్ గేటు నుంచి ఏర్పేడు హైవేలో వ్యతిరేక దిశలో వెళుతున్నట్లు గుర్తించి రూ.8వేలు జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ ఆటోలు, ద్విచక్ర వాహనాలు, బస్సులు టోల్ గేటు నుంచి ఏర్పేడు వైపు వ్యతిరేక దిశలో వెళుతున్నాయన్నారు. కొద్ది దూరమైనా సరే తిరిగి వెళ్లాల్సిందేనన్నారు. లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు మరమ్మతుకు వినతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని జంబుగోళం రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య వినతిపత్రం అందజేశారు. బుధవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పుత్తేరి గ్రామంలో పీఎంఎజీవై నిధులు రూ. 20 లక్షలతో వేసిన సిమెంట్ రోడ్డు ప్రారంభించి, రూ.13 లక్షల తో డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య జంబుగోళం రోడ్డు గుంతలమయమై అధ్వాన్నంగా ఉందని చెప్పారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా అధికారుల దృష్టికి తీ సుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

చంద్రబాబు మోసాలను ప్రజలు గుర్తించాలి



చంద్రబాబు మోసాలపై క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నూకతోటి రాజేష్

నాగలాపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలను ప్రజలు గుర్తించాలని వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయ కర్త నూకతోటి రాజేష్ అన్నారు. చంద్రబాబు మ్యానిఫెస్టో మోసాలను గుర్తు చేస్తూ బుధవారం సాయంత్రం నాగలాపురం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షులు అపరంజిరాజు అధ్యక్షతన బాబు షూరిటీ.. మోసం గ్యారంటీ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూకతోటి రాజేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు అమలు సాధ్యం కాని హామీలిచ్చి, ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను బురిడీ కొట్టించి, నేడు ఆ పథకాలన్నీ ప్రజలకు ఇచ్చేశామని చంద్రబాబు గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. సూపర్ సిక్స్ గురించి ప్రశ్నిస్తే నాలుక కట్ చేస్తామని చంద్రబాబు అనడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. నిరుద్యోగ భృతి, బాబు వస్తే జాబు, ఆడబిడ్డ నిధి వంటి హామీలు ఇప్పటివరకు కార్యరూపం దాల్చకపోవడం ఆయన మోసాలకు పరాకాష్ట అని చెప్పారు. 40 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం పథకం నేటికీ అందలేదని తెలిపారు. రైతుల గురించి ఏ మాత్రం ఆలోచించలేదని చెప్పారు. రాష్ట్రంలో మామిడి రైతులు కష్టాలు వర్ణణాతీతమన్నారు. మామిడి రైతుల ఇబ్బందులను తెలుసుకునేందుకు బంగారుపాళెం పర్యటనకు వచ్చిన ప్రతి పక్ష నాయకుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అడుగడుగున అడ్డుకుని, ఆంక్షలు విధించడం కూటమి నేతల పిరికి పంద చర్యకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నేతలు బీరేంద్రవర్మ, భానుప్రకాష్‌రెడ్డి, చిన్నదొరై, శ్యామ్, ఉదయ్ కుమార్ రెడ్డి, మోహన్ మొదలియార్, కులశేఖర్ రెడ్డి, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో కేంద్ర గృహనిర్మాణ శాఖ కార్యదర్శి



శ్రీసిటీలో కేంద్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి శ్రీనివాస్

వరదయ్యపాళెం: కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ కటికితల, ఆ శాఖ ఉన్నతాధికారులతో కలసి బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ ఆయనకు సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీలో అమలు చేస్తున్న సమర్థవంతమైన నీటి వనరుల నిర్వహణ, మురుగునీటి రీసైక్లింగ్, ఘన వ్యర్థాల నిర్వహణ, హరితహిత చర్యలు, ఇతర సుస్థిరత కార్యక్రమాలను శ్రీసిటీ ప్రతినిధులు మంత్రికి వివరించారు. టౌన్‌షిప్‌ల అభివృద్ధితో 'వాక్ టు వర్క్' ఆవశ్యకతను ప్రస్తావిస్తూ, ఇందుకోసం అవసరమైన సహకారం అందించాలని కార్యదర్శికి విన్నవించారు. ప్రస్తుత పారిశ్రామిక కార్యకలాపాలు, భవిష్యత్తు విస్తరణ వ్యూహాలు, మౌలిక సదుపాయాలు, నివాస గృహాల డిమాండ్ ముఖ్యంగా డార్మిటరీలు, సరసమైన అద్దె గృహాలపై శ్రీనివాస్ చర్చించారు. ఇతర పారిశ్రామిక ప్రాంతాల్లో విజయవంతమైన గృహ ప్రణాళికల నమూనాలను అధ్యయనం చేయాలని, కేంద్ర గృహ నిర్మాణశాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా వినూత్న ప్రతిపాదనలతో ముందుకు రావాలని ఆయన శ్రీసిటీ బృందానికి సూచించారు. అనంతరం, పారిశ్రామిక ప్రతినిధులతో చర్చల్లో పాల్గొన్న ఆయన, ప్రధానంగా మహిళా ఉద్యోగులకు చౌక ధరకు అద్దె గృహాలను అందుబాటులోకి తేవడంలో ప్రభుత్వ సహకారం, ఇతర అంశాలపై చర్చించారు. సమగ్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణాల విషయంలో మంత్రిత్వ శాఖ నుంచి పూర్తి సహకారం అందిస్తామని శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

గౌరవప్రదంగా భావిస్తున్నాం

కేంద్ర గృహనిర్మాణశాఖ ఉన్నతాధికారులు శ్రీసిటీ పర్యటనకు రావడం తాము గౌరవప్రదంగా భావిస్తున్నామని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. పర్యటనలో భాగంగా కేంద్ర కార్యదర్శి శ్రీనివాస్ శ్రీసిటీ పరిసరాలతో పాటు ఆల్‌స్టోమ్ పరిశ్రమను సందర్శించారు. కార్యదర్శితో పాటు కేంద్ర గృహ నిర్మాణశాఖ (అమృత్ పథకం) సంయుక్త కార్యదర్శి ఇషా కాలియా, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య, ఎంఓహెచ్‌యూఏ సాంకేతిక సలహాదారు రోహిత్ కక్కర్, సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి పాల్గొన్నారు.

బాలనాగాలమ్మకు విశేష పూజలు

సత్యవేడు: గురుపౌర్ణమి సందర్భంగా బుధవారం బాలనాగాలమ్మకు విశేష పూజలు చేశారు. అమ్మవారికి మధ్యాహ్నం విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం గోపూజ, సాయంత్రం సుమంగళి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న రూరల్ సీఐ మంజునాథరెడ్డి

రేణిగుంట: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని రూరల్ సీఐ మంజునాథ రెడ్డి అన్నారు. మండలంలోని కేఆర్సీ కాలేజీలో విద్యార్థులకు బుధవారం రూరల్ సీఐ మంజునాథ రెడ్డి సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులకు కీ, ఓటీపీ, పాన్, ఆధార్ వివరాలు చెప్పకూడదని సూచించారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కోరారు. సోషల్ మీడియాలో కొత్త వారితో జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా సోషల్ మీడియాలో వేధింపులకు పాల్పడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఆర్థికసాయం



బాధితురాలికి ఆర్థికసాయంతోపాటు సరుకులు అందజేస్తున్న తహసీల్దార్ సుధీర్‌రెడ్డి

వరదయ్యపాళెం: అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధితులకు రెవెన్యూ అధికారులు ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని సాతంబేడు గ్రామానికి చెందిన టి.చెంగయ్య, కృష్ణమ్మ దంపతులకు చెందిన పూరిల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధితులు తీవ్ర నష్టాన్ని చవిచూశారు. స్థానిక వీఆర్వో ద్వారా ప్రభుత్వానికి నివేదించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సుధీర్‌రెడ్డి బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితురాలు కృష్ణమ్మకు రూ.10 వేలు నగదు, 25 కిలోల బియ్యం, సరుకులను అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు మోహన్, రవిరెడ్డి, నాగేంద్ర, హనీఫ్‌లు పాల్గొన్నారు.

తొండమనాడులో సీపీఐ నేత నారాయణ



హేమభూషణరెడ్డి ఇంట్లో సీపీఐ నేత నారాయణ

శ్రీకాళహస్తి: సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ బుధవారం శ్రీకాళహస్తి మండలం తొండమనాడులో పర్యటించారు. అక్కడ మోతుబరి రైతు హేమభూషణ్ రెడ్డి ఆహ్వానం మేరకు వారి ఇంటికి వెళ్లారు. సుప్రీంకోర్టులో న్యాయవాదులుగా ఉన్న బర్రె హేమభూషణ్ రెడ్డి, బర్రె సుదర్శన్ రెడ్డి కుమారులు బర్రె పార్థసారథిరెడ్డి, బర్రె లోకేష్ రెడ్డితో కొద్దిసేపు ముచ్చటించారు. దేశ అత్యున్నత న్యాయస్థానంలో న్యాయవాదులుగా ఉన్న వారిని అభినందించారు. శ్రీకాళహస్తి నుంచి ఢిల్లీ స్థాయికి ఎదగడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం బర్రె హేమభూషణ్ రెడ్డి ఇంట్లోనే మధ్యాహ్న భోజనం చేశారు. శ్రీకాళహస్తి తాజా రాజకీయ పరిస్థితులపై కొద్దిసేపు చర్చించుకున్నారు. ఆయన వెంట సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి.మురళి, నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



పామాయిల్ సాగుపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

తొట్టంబేడు: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు గడించవచ్చని 3ఎఫ్ ఆయిల్‌పామ్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజర్ విజయప్రసాద్, జోనల్ మేనేజర్ వెంకట మురళి అన్నారు. తొట్టంబేడు మండలం శివనాథపురంలో 3ఎఫ్ ఆయిల్‌పామ్ ప్రైవేటు లిమిటెడ్ వారు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు స్థిర ఆదాయం ఉంటుందన్నారు. అంతే కాకుండా ప్రభుత్వం కూడా చేయూతనందిస్తోందని తెలిపారు. పామాయిల్ వాణిజ్య పంటగా రైతులకు దీర్ఘకాలిక ఆదాయాన్ని అందిస్తుందన్నారు. పామాయిల్ సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు రాయితీలు ఇస్తున్నాయన్నారు. మండలంలో తొలిసారి పామాయిల్ సాగు చేసిన విజయశ్రీ మాట్లాడుతూ తాను గతంలో వేరే పంటలు వేసి నష్టపోయానని పామాయిల్ సాగుపై అవగాహన పెంచుకుని ఈ ఏడాది సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పంట సాగులో ఎలాంటి సమస్యలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజామాణిక్యం, ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌నాయుడు, ఉద్యానశాఖ అధికారి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సమస్యలు పరిష్కరించండి

- సత్యవేడు టీడీపీ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ శంకర్‌రెడ్డికి వేడుకోలు

వరదయ్యపాళెం: టీడీపీ సత్యవేడు శాఖకు ఇటీవల ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్‌గా పార్టీ అధిష్టానం వ్యాపారవేత్త శంకర్ రెడ్డిని నియమించింది. అయితే ఆయనకు అప్పుడే పార్టీ శ్రేణుల నుంచి అసమ్మతి రాగాలు వినిపిస్తున్నాయి. ఇందుకు బుధవారం వరదయ్యపాళెంలో జరిగిన మండల స్థాయి పరిచయ వేదిక కార్యక్రమం వేదికైంది. ఈ సందర్భంగా పలువురు నాయకులు తమను పట్టించుకోవడం లేదని వాపోయారు. నియోజకవర్గానికి వివిధ హోదాల్లో వస్తున్న వారు కొందరికే కొమ్ము కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులను దూరం చేసి కార్యకర్తల సమస్యలు పరిష్కరించడానికి సమయం కేటాయించాలని కోరారు. అనంతరం ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ అందరి సమన్వయంతో ముందుకెళతామని చెప్పారు. ఈ సందర్భంగా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ఇందిరానగర్‌లో నిర్వహించారు. స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి ప్రజలు శంకర్‌రెడ్డి ఎదుట ఏకరువు పెట్టారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు యుగంధర్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ నిర్మల్, నాయకులు శివయ్య, నందకిషోర్, జయచంద్ర నాయుడు తదితరులు ఉన్నారు.

ముక్కంటి సేవలో ఎంపీ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం రాజ్యసభ సభ్యులు, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పాక వెంకట సత్యనారాయణ దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

కదం తొక్కిన కార్మికులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మికులు కదం తొక్కారు. నూతన కార్మిక చట్టాలను రద్దు చేయాలని నినదించారు. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాల్లో ర్యాలీలు, రాస్తారోకోలు, ఆందోళనలు చేశారు. మానవహారాలు ఏర్పాటు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రభుత్వాల వైఖరిపై మండిపడ్డారు.

–సాక్షి నెట్‌వర్క్



ర్యాలీ చేస్తున్న కార్మిక సంఘాలు



కేవీబీపురంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికుల మానవహారం



బుచ్చినాయుడుకండ్రిగలో రాస్తారోకో



రేణిగుంట పెన్షనర్స్ కార్యాలయం ఎదుట..





నాగలాపురంలో ర్యాలీ, సత్యవేడు: ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు



ఏర్పేడులో ర్యాలీ



సీఆర్ఎస్ ఎదురుగా నిరసన



రేణిగుంట అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన





సీఆర్ఎస్ వద్ద నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న పెన్షనర్లు, వరదయ్యపాళెంలో నిరసన తెలుపుతున్న కార్మికులు

యథేచ్ఛగా గ్రావెల్ తరలింపు

నాగలాపురం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మండలంలో మట్టి మాఫియాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. టీడీపీ కీలక నేతల కనుసన్నల్లో గ్రావెల్ తరలింపు జోరుగా సాగుతోంది. మండలంలోని రాజుల కండ్రిగ పరిసర ప్రాంతాల నుంచి రోజూ వందలాది లారీల గ్రావెల్‌ను తమిళనాడుకు తరలిస్తున్నారు. ఈ పరిణామాలను సాక్షాత్తు మండలానికి చెందిన కొందరు టీడీపీ నేతలే వ్యతిరేకిస్తున్నా తమని ఎవరూ ఏమి చేయలేరంటూ గ్రావెల్ తరలించి, అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. రోజు వందలాది టిప్పర్లు గ్రావెల్‌ను తరలిస్తుండడంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిని గుంతల మయమయ్యాయి. గ్రావెల్ రవాణాను కట్టడి చేయాల్సిన రెవెన్యూ, పోలీసులు, మైన్స్ యంత్రాంగం అటు వైపు కన్నెత్తి చూడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.